క్లుప్తంగా

నేడు స్టీల్ ప్లాంట్ సాధన ర్యాలీ

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించబోయే స్టీల్ ప్లాంట్ సాధన ర్యాలీని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు విష్ణుప్రీతమ్‌రెడ్డి తెలిపారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు కడపలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయం నుండి పాత కలెక్టరేట్ వరకు ర్యాలీ అనంతరం కార్నర్ మీటింగ్ జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నేతలు శ్రీరాములు, చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ ఎదుట ధర్నా



కడప కార్పొరేషన్: పారిశుధ్యాన్ని మెరుగుపరిచి, విష జ్వరాలను నియంత్రించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జి. చంద్ర, నగర కార్యదర్శి ఎన్. వెంకట శివ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలు నివాసం ఉంటున్న శివారు ప్రాంతాలు, మురికివాడల్లో పారిశుధ్యం పడకేసిందన్నారు. ఫలితంగా దోమలు పెరిగి వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. జ్వరపీడితులకు ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి. క్రిష్ణమూర్తి, బషీరున్నీసా తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో జీతాలను చెల్లించాలి

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ పరిధిలో పనిచేసే ఉద్యోగ, ఉపాధ్యాయులకు సకాలంలో జీతాలను చెల్లించి వారి ఆర్థిక ఇబ్బందులను తొలగించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధా న కార్యదర్శులు రమణారెడ్డి, వెంకట సుబ్బయ్యలు డిమాండ్ చేశారు. గురువారం కడపలోని ఎస్టీయూ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెంషనర్ల సమస్యల పరిష్కారంలో మొండి వైఖరిని ప్రదర్శిస్తోందన్నారు. ప్రతి నెలా ఉద్యోగులు జీతాల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మల్లు రఘునాథరెడ్డి, ఇలియాస్ బాష, సురేష్‌బాబు, హైదర్‌వలి తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ నియామకం

కడప కోటిరెడ్డిసర్కిల్ : బీజేపీ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు కడప జిల్లా పార్టీ నూతన కమిటీని గురువారం జిల్లా అధ్యక్షులు వంగల శశిభూషణ్‌రెడ్డి నియమించారు. జిల్లా ఉపాధ్యక్షులుగా గజ్జల రామకృష్ణారెడ్డి, లక్ష్మీదేవి, భూమిరెడ్డి భాస్కర్ రెడ్డి, గోసుల కళ్యాణ్ రాజు, పెడబల్లి సుష్మ, చేకూరి శారదమ్మ, వనం నరసింహులు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఉట్టి శ్రీనివాసులు, గాలి హరి ప్రసాద్, కోనేటి కృష్ణ ప్రదీప్ రెడ్డి, వెంకటసుబ్బారెడ్డిలను నియమించారు. అలాగే జిల్లా కార్యదర్శులుగా గుత్తిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, శాలివాహన భార్గవ్ యాదవ్, ప్రశాంతి సుబ్రహ్మణ్యం, కోశాధికారిగా మునగ సతీష్, యువమోర్చా అధ్యక్షులుగా బొమ్మన విజయ్, కిసాన్ మోర్చా అధ్యక్షులుగా తేరా మహేష్ రెడ్డి, మహిళా మోర్చా అధ్యక్షులుగా శోభాబాయ్, అధ్యక్షులుగా కోడి మూర్తి శ్రీరాములు, మైనార్టీ మోర్చా అధ్యక్షులుగా వంగలి షఫీ ఉల్లా, ఓబీసీ మోర్చా అధ్యక్షులుగా ప్రభు కుమార్‌లను నియమించారు.

మంత్రివర్గ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : కృష్ణా నీటి వివాదాలపై ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకే పరిమితం చేస్తూ కేంద్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయం ఉపసంహరించుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. గురువారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కృష్ణా నీటి వివాదాలపై ఏర్పాటైన బజావత్ ట్రిబ్యునల్ తీర్పు ప్రకారం కేటాయింపులను యధావిధిగా అమలు చేయాలన్నారు. మిగులు జలాలపై ఆధారపడి నిర్మిస్తున్న గాలేరు నగరి హంద్రీ నీవా, వెలుగొండ, తెలుగు గంగ ప్రాజెక్టుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారనున్నదని, బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పుపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సుప్రీంకోర్టులో వ్యాజ్యం దాఖలు చేసిందన్నారు. ఒకవైపు కేసు విచారణలో ఉండగానే కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కేవలం ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని అడ్డగోలు నిర్ణయాలు చేసి అందలమెక్కాలని చూస్తోందన్నారు.

ఈ స్టాంప్‌లను సద్వినియోగం చేసుకోండి

కమలాపురం : స్థానిక డీసీసీ బ్యాంక్‌లో అందుబాటులో ఉన్న ఈ స్టాంప్‌లను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజుపాళెం సుబ్బారెడ్డి తెలిపారు. గురువారం ఆయన స్థానిక డీసీసీ బ్యాంక్‌లో ఈ–స్టాంప్‌లను విడుదల చేశారు. భూములు, స్థలాలు, ఇళ్లు తదితర క్రయ విక్రయాలు జరుపుకునే వారికి డీసీసీ బ్యాంక్‌లో ఈ–స్టాంప్‌లను అందుబాటులో ఉంచామన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర మాత్రమే చెల్లించి స్టాంపులు పొందవచ్చని, ఎలాంటి రుసుములు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ సుధీర్‌రెడ్డి, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల చెంతకే మెరుగైన వైద్యం

డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



మోచంపేట ఆరోగ్య సురక్ష శిబిరానికి హాజరైన ప్రజలు

కడప కార్పొరేషన్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల చెంతకే మెరుగైన వైద్యం తేవడం జరిగిందని ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా అన్నారు. గురువారం స్థానిక మోచంపేటలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ప్రతి స్టాల్‌ను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. శిబిరానికి విచ్చేసిన రోగులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ఆరోగ్య సమస్యల వల్ల పేద ప్రజలు ఇబ్బంది పడకూడదని, వారి గడప వద్దకే వైద్యాన్ని తీసుకురావడం జరిగిందన్నారు. ఆరోగ్య సురక్ష శిబిరంలో 7 రకాల పరీక్షలు నిర్వహించి అరగంటలో రిపోర్టులు ఇవ్వడమేగాక ఉచితంగా మందులు అందిస్తారన్నారు. ఈ శిబిరంలో స్త్రీలకు సంబంధించిన వ్యాధులను చూసేందుకు గైనకాలజిస్ట్, చిన్నపిల్లల కోసం పీడియాట్రిక్, ఎముకలు, కీళ్ల నొప్పులకు సంబంధించి ఆర్థోపెడిక్, కంటి వ్యాధుల కోసం కంటి వైద్యులను, ఇతర వ్యాధులను పరీక్షించేందుకు జనరల్ మెడిసిన్ వైద్యులను అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దేశంలో ఎక్కడా లేనివిధంగా వైద్య, ఆరోగ్య శాఖలో 50వేల ఖాళీలను భర్తీ చేయడం జరిగిందన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా ఒక పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు ఉంటారని, ఒకరు పీహెచ్‌సీలో ఉంటే మరొకరు 104 వాహనంలో గ్రామాలు తిరిగి ప్రజలకు వైద్య సేవలందిస్తారన్నారు. ఆ తర్వాత రోగులకు జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కేఎంసీ కమిషనర్ ప్రవీణ్‌చంద్, టీటీడీ బోర్డు సభ్యులు మాసీమ బాబు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, డిప్యూటీ మేయర్లు ముంతాజ్ బేగం, నిత్యానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు జయచంద్రారెడ్డి, చల్లా రాజశేఖర్, డా. సొహైల్, జమాల్‌వలీ, ఎస్. సుబ్బారెడ్డి, అజ్మతుల్లా, రామ్మోహన్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి’ని జయప్రదం చేయాలి

– ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: ‘ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి’ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా కోరారు. గురువారం స్థానిక జీఎస్ ఫంక్షన్ హాలులో నిర్వహించిన క్లస్టర్–1 సమావేశంలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ అక్టోబర్ 11 నుంచి నవంబర్ 11 వరకూ ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రతి వార్డులో, ప్రతి కాలనీలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించి రాష్ట్రానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవసరం ఎంత ఉందో తెలియజెప్పాలన్నారు. ప్రభుత్వ పథకాల వల్ల ప్రతి ఇంటికీ మేలు జరిగిందని, ఇంకా ఎవరైనా అర్హులు ఉంటే పథకాలు వర్తింపజేస్తామన్నారు. ప్రతి వార్డులో వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరణలు చేయడం, రాత్రి బస కార్యక్రమాలను సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు జయప్రదం చేయాలన్నారు. వచ్చే ఎన్నికల్లో తప్పనిసరిగా వైఎస్సార్‌సీపీ గెలవాల్సిన అవసరముందని, ఆ మేరకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు మాసీమ బాబు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, సుభాన్‌బాషా, రఫీ, అరీఫుల్లా బాషా, షంషేర్, సుబ్బారెడ్డి, తోటక్రిష్ణ పాల్గొన్నారు.

గానుగపెంటకు సత్కారం

కడప కార్పొరేషన్/ కడప ఎడ్యుకేషన్: రాష్ట్రపతి అవార్డు గ్రహీత, విద్వాన్ గానుగపెంట హనుమంతరావు సేవలు గర్వకారణమని డిప్యూటీ సీఎం అంజద్‌బాషా అన్నారు. గురువారం తన క్యాంపు కార్యాలయంలో అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మౌలానా ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో గానుగపెంటను ఘనంగా సన్మానించి, ఉపాధ్యాయ రత్న అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ గానుగపెంట సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బీహెచ్ ఇలియాస్, జయచంద్రారెడ్డి, ఎస్. సుబ్బారెడ్డి, తోటక్రిష్ణ, పస్తం అంజి, చెన్నంశెట్టి మురళీ పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ ఆశీర్వదించండి



పథకాలు వివరిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ప్రతి ఇంటికీ లబ్ధి చేకూర్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్ బాషా కోరారు. గురువారం ।గడప గడపకు మన ప్రభుత్వం।లో భాగంగా 8వ డివిజన్‌లోని శంకరాపురంలో ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఏవిధంగా చేరుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం అంజద్ బాషా మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయంగా ముఖ్యమంత్రి పనిచేస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కుల, మత, పార్టీలకతీతంగా అర్హత ఉన్న పేద ప్రజలందరికీ సంక్షేమ పథకాలను అందించారని, ఆయన్ను మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. జి. వరదారెడ్డి అనే వ్యక్తి మాట్లాడుతూ తన కుటుంబానికి వివిధ ప్రభుత్వ పథకాల ద్వారా రూ.11.41లక్షల మేలు జరిగిందన్నారు. షేక్ షబీనా అనే మహిళ మాట్లాడుతూ తనకు జగనన్న చేదోడు, వైఎస్సార్ వాహనమిత్ర, జగనన్న అమ్మ ఒడి, ఇంటి స్థలం, ఇల్లు ద్వారా రూ.9.40 లక్షల లబ్ధి కలిగిందని సంతోషం వ్యక్తం చేసింది. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, 8వ డివిజన్ ఇంచార్జి ఏ. బాలకృష్ణా రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు జయచంద్రారెడ్డి, తోటక్రిష్ణ, కిరణ్, సుబ్బారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, పస్తం అంజి, షఫీవుల్లా, సింధు, మహిళా నేతలు మూలే సరస్వతి, పత్తి రాజేశ్వరి, టీపీ వెంకట సుబ్బమ్మ, ఉమామహేశ్వరి, బండి మరియలు పాల్గొన్నారు.

జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

పెండ్లిమర్రి : అభివృద్ధి, సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రతి ఒక్క లబ్ధిదారునికి అందాలంటే రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రిగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. గురువారం పెండ్లిమర్రిలో జేసీఎస్ కన్వీనర్లు, గృహసారథులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులకు ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా ప్రజలకు చేసిన మంచి పనుల గురించి ప్రజలకు వివరించాలన్నారు. గతం ప్రభుత్వంలో ఏమేరకు అభివృద్ధి జరిగింది. ఈ ప్రభుత్వంలో ఏమేరకు అభివృద్ధి జరిగిందో ప్రజలకు వివరించాలన్నారు. మండల నాయకులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఈనెల 11వ తేదీ నుంచి ఇంటింటికి వెళ్లి ప్రజలకు అందించిన పథకాల గురించి చెప్పాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించి ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ ఛైర్మన్ బాలయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రారెడ్డి, ఆగ్రో కార్పొరేషన్ డైరెక్టర్ చావలి శివ, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు రమణారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ రామమోహన్‌రెడ్డి, సర్పంచ్ నాగమల్లారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఘన సన్మానం



రాజారావును సన్మానిస్తున్న కళాశాల అధ్యాపకులు



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

కడప ఎడ్యుకేషన్: వైవీయూ పరిధిలో ఉత్తమ ఎన్‌సీసీ పోగ్రాం ఆఫీసర్‌గా ఎంపికై అవార్డును అందుకున్న ప్రభుత్వ బాలుర కళాశాల పౌరశాస్త్ర అధ్యాపకుడు చెప్పలి రాజారావును గురువారం సన్మానించారు. కడప ప్రభుత్వ బాలుర కళాశాలలో ప్రిన్సిపాల్ నూర్జహాన్ ఆధ్వర్యంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది శాలువాతో సన్మానించారు.

– జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని కడప గాంధీనగర్‌లో ఆంగ్ల ఉపాధ్యాయురాలు రూతు ఆరోగ్యమేరీని ఆర్‌కే సేవా సమితి ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో ఆర్‌కే సేవా సమితి అధ్యక్షుడు అబ్దుల్ రాయల్ కరీముల్లా, కొండా సుబ్బయ్య, జిల్లా బీసీ నాయకుడు దస్తగిరి పాల్గొన్నారు.

కడప కల్చరల్ : రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ, లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య, ఇంటాక్ ఉమ్మడి ఆధ్వర్యంలో సంస్థలో సేవలందిస్తున్న ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. రాష్ట్ర అధికార భాషా సంఘం సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సీనియర్ రిటైర్డ్ హిందీ పండితులు కల్లూరు బాల యల్లారెడ్డి, కేవీ రమణా రెడ్డి, రిటైర్డ్ తెలుగు పండితులు డాక్టర్ వెల్లాల వేంకటేశ్వరాచారి, పి.నాగాంజనేయులు ఉపాధ్యాయులుగా చేసిన సేవలను కొనియాడారు. సంస్థల ప్రతినిధులు కొండూరు జనార్దన రాజు, లయన్ పోతుల వెంకట్రామిరెడ్డి, ఇంటాక్ కన్వీనర్ కె.చిన్నప రెడ్డి పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి



చెన్నూరులో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో స్టాల్ ఏర్పాటు చేసిన ఐసీడీఎస్ సిబ్బంది



వల్లూరు : వైద్య సేవలందిస్తున్న వైద్య నిపుణులు

చెన్నూరు : మండలంలోని శివాలపల్లె వైఎస్సార్‌సీపీ క్లినిక్‌లో సర్పంచ్ సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో 300 మందికి వైద్యసేవలు అందించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. 45 మందికి వైఎస్సార్ కంటి వెలుగు ద్వారా ఉచితంగా అద్దాలు పంపిణీ చేశారు.

అనంతరం స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గర్భిణులకు పౌష్టికాహారం అందించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి సీహెచ్ వెంకటసుబ్బయ్య, ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్, మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ జీఎస్ భాస్కర్‌రెడ్డి, వైద్యాధికారి బి.చెన్నారెడ్డి, తహసీల్దార్ పఠాన్‌అలీఖాన్, ఎంపీడీఓ సుబ్రమణ్యం శర్మ, మండల ఉపాధ్యక్షులు ఆర్‌ఎస్‌ఆర్(చిన్న), సచివాలయ సిబ్బంది వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నె : మండల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని ఇప్పపెంట–2 సచివాలయ పరిధిలోని జె.కొత్తపల్లిలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి పరిశీలించి మాట్లాడారు. అనంతరం స్థానిక వైద్యులను ప్రశంసించారు. కార్యక్రమంలో రిమ్స్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.దీప్తి, తహసీల్దార్ ఎంవీ సత్యనారాయణరెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీధర్‌లను అభినందించారు. **వల్లూరు** : మండలంలోని కొప్పోలు ఎస్సీ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురువారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో 257 మందికి వైద్య సేవలను అందించారు. వైద్య నిపుణుల ఆధ్వర్యంలో 55 మందికి వివిధ వైద్య పరీక్షలను నిర్వహించారు. 61 మందికి కంటి వైద్య పరీక్షలను నిర్వహించారు. 11 మందిని ఉన్నత స్థాయి వైద్య సేవలకై రెఫర్ చేశారు. అనంతరం మందులను, ఆయుష్మాన్ భవ ఆరోగ్య కార్డులను పంపిణీ చేశారు. ఎంపీడీవో జుబేద, తహసీల్దార్ శంకర్‌రావు పాల్గొన్నారు.

నేటి నుంచి నూతన భవనంలో వైద్య సేవలు

కమలాపురం : నగర పంచాయతీ కార్యాలయం పక్కన ఉన్న సీహెచ్‌సీ నూతన భవనంలోనే శుక్రవారం నుంచి వైద్య సేవలు అందిస్తామని సీహెచ్‌సీ జనరల్ సర్జన్ డాక్టర్ సునీల్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రసుతం బీఎస్ఎన్ఎల్ కార్యాలయం పక్కనున్న గ్రంథాలయ భవనంలో సీహెచ్‌సీ కొనసాగుతుందన్నారు. ఇటీవల సీహెచ్‌సీ నూతన భవనం ప్రారంభం కావడంతో వైద్య సేవలు అక్కడి నుంచి ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. ప్రజలు సీహెచ్‌సీ నూతన భవనంలో వైద్య సేవలు వినియోగించుకోవాలని ఆయన తెలిపారు.

హిందీ నేర్చుకుంటే అనేక ప్రయోజనాలు



మాట్లాడుతున్న రీజినల్ పీఎఫ్ కమిషనర్ మనోజ్

కడప కల్చరల్ : హిందీ భాష పక్షోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ గురువారం ఘనంగా నిర్వహించింది. భాషోత్సవం సందర్భంగా సెప్టెంబరు 14 నుంచి 29వ తేది వరకు జరిగిన కార్యక్రమాల్లో భాగంగా జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. విజేతలైన వారికి గురువారం కడప నగరం ఎర్రముక్కపల్లెలోగల సంస్థ కార్యాలయంలో బహుమతి ప్రదానోత్సవం నిర్వహించారు. సంస్థ రీజినల్ పీఎఫ్ కమిషనర్లు మనోజ్, శంకర్, గౌరవ్ మహల్‌వాల్‌లు ఈ సందర్భంగా హిందీ భాష ఔన్నత్యం, దాని నేర్చుకోవడం ద్వారా దేశ ప్రజలకు ఒనగూరే ప్రయోజనం గురించి వివరించారు. అనంతరం విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ అనువాద అధికారి షేక్ మహబూబ్ బాష తదితరులు పాల్గొన్నారు.

నేడు కాలాష్టమి పూజలు

కడప కల్చరల్ : కడప నగర శివార్లలోని కాలభైరవపురంలో శుక్రవారం శ్రీ ఇష్ట కామ్యార్థ కాలభైరవ స్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు శ్రీధర్‌శర్మ తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి అభిషేకం, అష్టోత్తరం, కాలభైరవ మంత్ర పఠనం నిర్వహిస్తారన్నారు.

వద్దిరాలపై విమానం చక్కర్లు

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : సర్వే నిమిత్తం వచ్చిన ఓ విమానం వద్దిరాల పరిసరాల చుట్టూ రెండు గంటల పాటు చక్కర్లు కొట్టింది. గురువారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు మైలవరం కొండాపురం మండలాల్లోని పలు గ్రామాలపై అనేక సార్లు చక్కర్లు కొట్టింది. మైలవరం మండలంలోని వద్దిరాల, చిన్న వెంతుర్ల, బెస్తవేముల, దొడియం, నక్కోనిపల్లె, రామచంద్రాయపల్లె, అలాగే కొండాపురం మండలంలోని తిరుమాలయపల్లె, దొబ్బుడుపల్లె, టి.కొడూరు, ఎస్ కొత్తపల్లె తదితర గ్రామాలపై చక్కర్లు కొట్టింది. మైలవరం–కొండాపురం మండలాల మధ్య కొని వేల ఏకరాల కొండ ప్రాంతం ఉంది. ఈ కొండల్లోని భూగర్భంలో విలువైన ఖనిజాలు ఉన్నట్లు సమాచారం. ఖనిజ నిల్వల నిర్ధారణకో లేక మరి ఏదైన పరిశ్రమ స్థాపనకో సర్వే నిమిత్తం ఈ విమానం చక్కర్లు కొట్టినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. గత నెల 30వ తేదీన శనివారం కూడా ఉదయం ఇదే ప్రాంతంలో ఇలాంటి విమానమే అరగంట పాటు చక్కర్లు కొట్టి వెళ్లింది. తిరగి 5 రోజుల తరువాత గురువారం రెండు గంటలకు పైగా విమానం చక్కర్లు కొట్టింది.

రోడ్డు పనులను పూర్తి చేయాలి



డ్రైనేజీ కాలువ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్: బుగ్గవంక పక్కన 40 అడుగుల అప్రోచ్ రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలని కేఎంసీ కమిషనర్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. గురువారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఆయన బుగ్గవంక, ఉక్కాయపల్లె గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ ప్రాంతాలను సందర్శించారు. నగరంలో జరుగుతున్న డ్రైనేజీ కాలువలు, సర్కిళ్ల పునర్నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుగ్గవంక అప్రోచ్ రోడ్డు పనుల్లో ఎక్కడైతే కంపచెట్లు ఉన్నాయో వాటిని వెంటనే తొలగించాలని, వీధి దీపాల స్తంభాలను ఏర్పాటు చేయాలన్నారు. ఇంకా ఎక్కడైనా ఆక్రమణలు ఉంటే తొలగించాలన్నారు. ఉక్కాయపల్లె గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌కు వచ్చే చెత్తను తడి, పొడి చెత్తలుగా వేరు చేయాలన్నారు. నగరంలో బోరు ద్వారా నీరు సరఫరా అయ్యే ప్రాంతాలను గుర్తించి, పైపులైన్లకు తగిన మరమ్మతులు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శివరామిరెడ్డి, ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

బీసీ కాలనీని చుట్టుముట్టిన నీరు



పాత కడప బీసీ కాలనీలో ఇంటిని చుట్టుముట్టిన నీరు



మురికినీటిలో వెళ్తున్న చిన్నారి

కడప కార్పొరేషన్: కడప నగరం 1వ డివిజన్‌లోని పాత కడప బీసీ కాలనీ ప్రధాన దారిని మురికినీరు, చెరువు కాలువ నీరు చుట్టుముట్టాయి. బీసీ కాలనీ ప్రజలు రాకపోకలు సాగించాలంటే ఈ దారి మీదుగానే వెళ్లాల్సి రావడంతో విద్యార్థులు, వృద్ధులు, చిన్నపిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నీటివల్ల కొన్ని ఇళ్లలోంచి ప్రజలు బయటికి రాలేని పరిస్థితి ఏర్పడింది. వర్షాలు వచ్చినప్పుడు ఇది మరింత తీవ్రంగా ఉంటుందంటున్నారు. నీరు ఎక్కువ కాలం నిల్వ ఉండటం వల్ల దుర్వాసన వేస్తూ, దోమలు, విష పురుగులకు నిలయంగా మారింది.

చాలామంది ఈ నీటి వల్ల జ్వరాల బారిన పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి నీరు పోయే మార్గం చూపాలని కోరుతున్నారు.